

# బన్నీతో జోడీగా?

అగ్ర కథానాయిక సమంత నటనతో పాటు సినీనిర్మాణంపై దృష్టి పెడుతూ బిజీగా ఉంది. మరోవైపు సోషల్‌మీడియాలో కూడా యాక్టివ్‌గా మారింది. ఇటీవలే ఈ అమ్మడు 'ఎక్స్'లోకి రీఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సమంత స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నది. రెండేళ్లక్రితం వచ్చిన 'ఖుషీ' తర్వాత పెద్ద చిత్రాలు చేయలేదు సమంత. ఈ ఏడాది మాత్రం భారీ ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యేందుకు సిద్ధమవుతున్నదని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఇటీవల ప్రకటించిన అల్లు అర్జున్-అట్లీ పాన్ ఇండియా చిత్రంలో సమంత కథానాయికగా నటించే అవకాశముందని చెన్నై ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లకు చోటుంటుందట. మరో నాయికను బాలీవుడ్ నుంచి తీసుకుంటారని తెలుస్తున్నది. 'సన్నాఫ్ సత్యమూర్తి' సినిమాలో బన్నీతో జోడీగా నటించింది సమంత. ఆ తర్వాత 'పుష్ప'లో ప్రత్యేకగీతంలో ఆయనతో నర్తించింది. ఒకవేళ అట్లీ-బన్నీ ప్రాజెక్ట్‌లో సమంత నాయికగా ఖరారైతే ఇది వాళ్లిద్దరికి హ్యాట్రిక్ కాంబినేషన్ కానుంది. అయితే ఈ వార్తల్లో వాస్తవమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు.

# పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పానిండియా సినిమా షూటింగ్ ఇటీవలే అధికారికంగా మొదలైన విషయం తెలిసిందే. అయితే.. ఆ షూటింగ్‌లో ఎన్టీఆర్ మాత్రం పాల్గొనలేదు. ఆయన లేని సన్నివేశాలను ప్రశాంత్‌నీల్ చిత్రీకరించారు. తాజాగా ఈ పానిండియా ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్‌డేట్‌ని చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ తన ఎక్స్(ట్విటర్) వేదిక ద్వారా పంచుకున్నది. ఈ నెల 22 నుంచి మొదలుకానున్న ఈ సినిమా మలి షెడ్యూల్‌లో ఎన్టీఆర్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు, కీలక సన్నివేశాలతోపాటు కొన్ని భారీ యాక్షన్ సన్నివేశాలను కూడా ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. భారతీయసినీ చరిత్రలో ఓ మార్క్‌ని క్రియేట్ చేసేలా ఈ సినిమా ఉంటుందని వారు తెలిపారు. పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. మలయాళ నటుడు టొవినో థామస్ కీలక పాత్రలో సందడి చేయనున్నట్టు తెలుస్తున్నది. వచ్చే ఏడాది జనవరి 9న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

# వచ్చే నెల 30న దేవరకొండ కింగ్‌డమ్



టాలీవుడ్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' ఒకటి. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన ప్రచారచిత్రాల వల్ల ఈ సినిమాపై అంచనాలు బాగా పెరిగాయి. వేసవి కానుకగా మే 30న పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. మరోవైపు పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్నందిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. త్వరలోనే 'కింగ్‌డమ్' పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్‌లో ఆయన జాయిన్ అవుతారని సమాచారం. అనిరుధ్ నేపథ్య సంగీతం తోడైతే సినిమా నెక్ట్స్ లెవల్లో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. భాగ్యశ్రీబోర్సే ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.



# తల్లీ కొడుకుల అనుబంధానికి దర్పణం

నందమూరి కల్యాణ్‌రామ్ నటించిన మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అగ్ర నటి విజయశాంతి కీలక భూమిక పోషించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. తల్లీకొడుకుల అనుబంధమే ప్రధానాంశంగా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్తూరులో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమాలోని రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ముచ్చటగా బంధాలే..' అంటూ సాగే ఈ పాటను రఘురామ్ రాయగా, అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచారు. హరిచరణ్ ఆలపించారు. అమ్మ స్వభావాన్ని హైలైట్ చేస్తూ రఘురామ్ ఈ పాట రాశారని, కొడుకు విజయం కోసం తపించే తల్లి మనసు ఈ పాటలో ఆవిష్కృతం అయ్యిందని మేకర్స్ తెలిపారు. తల్లీకొడుకుల ప్రేమతోపాటు సాయి మంజ్రేకర్‌తో హీరో రిలేషన్‌ని కూడా ఈ పాటలో చూడొచ్చు. సోహైల్‌ఖాన్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కథనం: శ్రీకాంత్ విస్సా, కెమెరా: రామ్‌ప్రసాద్, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

# అబ్కీ బార్ అర్జున్ సర్కార్



హీరో నాని ప్రస్తుతం యాక్షన్ మోడ్‌లో ఉన్నారు. ఈ మధ్యే 'ప్యారడైజ్' సినిమా గ్లింప్స్‌లో బలవంతులను ధిక్కరించే సామాన్యుడిగా పవర్‌ఫుల్ యాక్షన్‌ను పండించారు. మరోవైపు 'హిట్-3'లో రూత్‌లెస్ పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా నేరస్థులపై యుద్ధానికి సిద్ధమవుతున్నారు. సక్సెస్‌ఫుల్ 'హిట్' ఫ్రాంచైజీలో మూడో చిత్రమిది. శైలేష్ కొలను దర్శకుడు. మే 1న విడుదలకానుంది. బుధవారం ఈ సినిమాలోని 'అబ్కీ బార్ అర్జున్ సర్కార్..' అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు. అర్జున్ సర్కార్ రాజీపడని వ్యక్తిత్వాన్ని, దూకుడు స్వభావాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. శత్రువులపై ప్రతీకారం తప్పదనే హెచ్చరికలతో ఈ పాట పవర్‌ఫుల్‌గా సాగింది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందించిన ఈ పాటను కృష్ణకాంత్ రచించారు. ట్రైలర్‌ను ఈ నెల 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, రచన-దర్శకత్వం: డా|| శైలేష్ కొలను.

# నీవు నేను ఇక మనమే..



శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. సాక్షివైద్య, సంయుక్తమీనన్ కథానాయికలు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. బుధవారం ఈ సినిమా నుంచి 'దర్శనమే...' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. విశాల్‌చంద్రశేఖర్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి సంగీతాన్నందించారు. యాజిన్ నిజార్ ఆలపించారు. 'దర్శనమే మధుర క్షణమే, నీవు నేను ఇక మనమే, మనసున మోగే మంగళ నాదస్వరమే' అంటూ చక్కటి మెలోడీతో భావయుక్తంగా సాగిందీ పాట. నాయకానాయికలు శర్వానంద్, సంయుక్తమీనన్ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ముక్కోణపు ప్రేమకథగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.

# షారుఖ్ సరసన లక్కీఛాన్స్



షారుక్‌ఖాన్ కుమార్తె సుహానాఖాన్ లీడ్‌రోల్ చేస్తున్న చిత్రం 'కింగ్'. ఇందులో షారుఖ్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకుడు. ఈ సినిమాలో షారుఖ్ భార్యగా దీపికా పదుకోన్ కనిపించనున్నదనీ, ఆమె పాత్ర నిడివి తక్కువగా ఉన్నా, కీలకమైన పాత్ర అనీ.. ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా సర్క్యులేట్ అయ్యింది. అయితే.. ఆ వార్తలో ఏమాత్రం నిజం లేదని దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తెలిపారు. అసలు 'కింగ్'లో ఆమెను తీసుకోవాలనే ఆలోచనే తమకు లేదని ఆయన తేల్చి చెప్పారు. ఆదిత్య చోప్రా త్వరలో 'పఠాన్ 2' నిర్మించనున్నారని, ఆ సినిమాలో అందరం షారుఖ్, దీపికా జోడీని చూడొచ్చని సిద్ధార్థ్ అన్నారు. ఇంకా ఆయన చెబుతూ.. 'కింగ్'లో పంజాబీ స్టార్ హీరోయిన్ సోనమ్ బజ్వా కీలక పాత్ర పోషించనున్నది. ప్రస్తుతం ఆమె హౌస్‌ఫుల్ 5, బాఘీ4 చిత్రాలతో బీజీగా ఉన్నది. 'కింగ్' ఆమె నటిస్తున్న అతి పెద్ద ప్రాజెక్ట్. ఇందులో ఆమె పాత్ర ఆసక్తికరంగా ఉంటుంది. దాని వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ఈ ఏడాది ఇండియాలో ఒక షెడ్యూల్ చేస్తాం. ఇందులో అభిషేక్ బచ్చన్ కూడా ఓ ప్రధాన భూమిక పోషిస్తారు.' అని సిద్ధార్థ్ ఆనంద్ తెలిపారు.



# రెండొందల శాతం నచ్చుతుంది

''టిల్లు స్క్వేర్' తర్వాత ఎలాంటి కథలు చేయాలని చాలా ఆలోచించాను. అదే మీటర్‌లో ఉండాలి కానీ..కథ మాత్రం కొత్తగా అనిపించాలనుకున్నా. 'జాక్' కథ వినగానే 'టిల్లు స్క్వేర్' తర్వాత ఇదే పర్‌ఫెక్ట్ సినిమా అనిపించింది' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'జాక్-కొంచెం క్రాక్'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. వైష్ణవి చైతన్య కథానాయిక. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిద్ధు జొన్నలగడ్డ..'జాక్' కోసం మంచి టీమ్‌తో పనిచేయడం ఆనందంగా ఉందని, 'టిల్లు' సిరీస్‌లో వచ్చిన చిత్రాలతో తనకు ఓ కామెడీ టైమింగ్ కుదిరిందని, దానిని 'జాక్'లో మిస్ అవకుండా చూసుకున్నానని తెలిపారు. 'సిద్ధులో ఉన్న స్పార్క్‌ని ఎప్పుడో కనిపెట్టాను. అది ఈ సినిమాలో వైల్డ్‌ఫైర్‌లా ఉంటుంది. కథానాయిక వైష్ణవి చైతన్య ప్రతీ సీన్‌లో అద్భుతంగా నటించారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ పేర్కొన్నారు. సినిమా విజయంపై టీమ్ అంతా పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ చెప్పారు. 'టిల్లు' కంటే రెండింతల వినోదంతో ప్రేక్షకుల్ని సిద్ధు ఎంటర్‌టైన్ చేస్తారని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు.

# సామాజిక సందేశంతో 'పోలీసు వారి హెచ్చరిక'



సన్నీ అఖిల్, రవికాలె, అజయ్ ఘోష్, షాయాజీ షిండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాజ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లి జనార్ధన్ నిర్మాత. బుధవారం ఈ సినిమా నుంచి ఓ ప్రేమగీతాన్ని సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. సాధారణంగా హీరోహీరోయిన్లు ప్రేమగీతాలను పాడుకుంటారని, అందుకు భిన్నంగా ఈ సినిమాలో విలన్లు డ్యూయెట్‌లు పాడుకోవడం వెరైటీ కాన్సెప్ట్ అని ఆయన పేర్కొన్నారు. చక్కటి సామాజిక సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, సెన్సార్ పూర్తి చేసి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకుడు బాజ్జీ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు, రచన-దర్శకత్వం: బాజ్జీ.





